



# ఆవర్జా


చంద్రలత


బ్యాలన్స్‌షీట్ ఎంతకీ ట్యాలీ కావడంలేదు. ఎక్కడో ఏదో ఎంట్రీ తప్పిపోయింది. జమలోనో, ఖర్చులోనో. తీసివేతలోనో, కూడికలోనో. లెక్క తప్పుపోయింది. ప్చ్! విధీశ చికాకుగా ఫైలును మూసేసి టేబుల్‌పై పడేసింది.

ఇవ్వాళంతా ఇంతే.

ఏది కదిలిద్దామన్నా జారిపడిన ఊలుబంతిలా చిక్కుపడిపోతున్నది.

విధీశ చేతిలోని ఆడిట్ పెన్సిల్‌ను వేళ్ల మధ్య ఆడించింది.

ఓ పక్క ఎరుపు, మరోపక్క నీలం.

ఇదీ విచిత్రమే.

అటు రౌద్రం, ఇటు శాంతం.

అటు నిప్పు, ఇటు నీరు.

ఏమిటీ తలాతోకాలేని ఆలోచనలు!

అవునవును...

అటు తల, ఇటు తోక!

విధీశ చేతిలోని పెన్సిల్‌ను టేబుల్‌పై పడేసి చేతివేళ్లు విరుచుకుంది.

ఇలా ఆలోచించడం మొదలుపెడితే ఇక ఈ పూట పని అయినట్టే!

ఈమధ్య తరుచూ ఇలాగే ఉంటోంది.

ఒకరోజుకు మరోరోజటికి ఎంతో తేడా.

ఈరోజు అత్యవసరమైనదనిపించింది మర్నాడు పనికిరానిదనిపిస్తోంది.

ఈ పూట తేలిగ్గా తీసిపారేసింది మరో పూట ముఖ్యమైనదనిపిస్తోంది.

బాధ్యతాయుతమైన పనిలో నిమగ్నమై ఉన్న తనకే ఇలాంటి చంచలత్వం వస్తే ఎలా?

చంచలత్వం!

అవునవును... చిన్నపుడు ఎపుడో ఎక్కడో విన్నట్లే గుర్తు.

స్త్రీకి స్థిరత్వమే ఉండదని!

చంచల స్వభావమే ఆమె నైజమని!

ట్రాష్...!!

అదేమాట వేరెవరన్నా తనతో అంటేనా...!

ఏమిటా వంకర తీర్మానాలు...?

"ఛ! సదరు చంచలత్వాన్ని అసహ్యించుకొనే ముందు నీ శరీరాన్ని నీవు అర్థం చేసుకోవాలోయ్..." అంది నవ్య ఓసారి.

"అదేంటి?"

"బయోలాజికల్లీ స్పీకింగ్... నీలోని రసాయనాలే నీ శరీరాన్ని నీ మనసును నీ ప్రవర్తనను నీ మూడ్స్‌ని అదుపులో పెట్టి... తోచినట్లు ఆడిస్తుంటాయి... తోలు బొమ్మలాటలో కనిపించని దారాల్లా..."

"నాకర్థం కావట్లేదు..."

"సింపుల్. నీలో ఉండే హార్మోన్స్... ఋతుచక్రం పొడవునా గీసే అప్ అండ్ డౌన్ గ్రాఫ్... అదీ నీ ఒక్కో రోజు ఒక్కోలాగా ఉండటానికి బయోలాజికల్ రీజన్!"

అర్థం చేసుకోవాలి.

ఎవరర్థం చేసుకోవాలి ?

నేనా?

నువ్వా?

పుట్టింటివారా?

అత్తింటివారా?

తోబుట్టువులా?

తోడికోడళ్లా?

"అందరూ!" నవ్య టక్కున అంది.

ఆ అందర్లో ప్రద్యుమ్న లేడూ?

"ఎందుకు లేడు? ఉన్నాడు. మొదట నిన్ను నీవు అర్థంచేసుకో... తరువాత మీ ఆయన సంగతి!"

"పోవోయ్... మొదట అతనే అర్థం చేసుకోవాలి!" పట్టుబట్టింది తను.

"ముందు అతనికి చెప్పు," ఖరాఖండిగా చెప్పేసింది.

"సరే తల్లీ! అలాగే చెప్తా," నవ్య నవ్వేసింది. రాజు కన్నా మొండివాడు బలవంతుడని ఊరికే అన్నారా?

అంతటి బిజీ గైనకాలజిస్ట్ నవ్య తన పట్టుదలకి తలొగ్గింది. ప్రద్యుమ్నని ఇవ్వాళ మాట్లాడడానికి పిలిచింది, తన బిజీ షెడ్యూల్‌ను కాస్తంత సవరించి.

పట్టువిడుపులు లేకపోతే ఎలా? ఉండాలి!

ప్రద్యుమ్న ఏ విషయమూ పట్టించుకోవడం లేదనే తన పట్టు అంతా!

"నువ్వెప్పుడూ అంతే - మొండితనం మానవు కదా!" అమ్మ ఎప్పుడూ అంటుంది.

మొండితనమో మొరటుతనమో కానీ వద్దన్న పని చేయాలంటే మహా ఉత్సాహం తనకి.

అమ్మ అన్నట్లు కడుపులో చల్ల కదలకుండా తిని కూర్చోవచ్చు కదా తను.

ఊహూ... అలా ఎలా?

వీలుకాదు. కానేకాదు.

"కొందరి రాతలంతే. అదృష్టం అందలమెక్కిస్తే బుద్ధి బురదలోకి లాగుతుందనీ..." ఆ ధోరణిలోనే మరో ఆమడవెళ్లి అమ్మ ఓ దీర్ఘం తీసింది.

"నువ్వైనా చెప్పరాదూ బాబూ..." అమ్మానాన్నలు కూడబలుక్కుని ప్రద్యుమ్నని అడిగారు.

"నలుగురిలోకి వెళితేనే కదండీ... లోకంపోకడ తెలిసేది. ఆమె ఇష్టప్రకారమే కానివ్వడం అందరికీ మంచిది," ప్రద్యుమ్న తనకే వత్తాసు పలికాడు.

జరగాల్సింది జరిగింది. చకచక.

పల్లె పట్నమూ కాని ఈ ఊళ్లో మొట్టమొదటి మహిళా ఆడిటర్‌గా రంగప్రవేశం చేసింది అట్టహాసంగా.

మిగిలిన ఆడిటర్లంతా ఆరోజు తమ రంగంలో స్త్రీల అభ్యుదయ అవకాశాల గురించి వివరంగా చక్కగా ప్రసంగించారు. తననెంతో ప్రశంసించారు.

ప్రద్యుమ్న ఆశించిందే జరిగింది.

ఏడాది తిరిగేసరికి దిమ్మ తిరిగి వచ్చింది.

ప్రద్యుమ్న అంత నింపాదిగా ఎందుకు వత్తాసు పలికాడో చక్కగా తెలిసివచ్చింది.

విధీశకు చికాకు మాయమై నవ్వొచ్చింది.

ఎంతయినా ప్రద్యుమ్నకు ముందుచూపెక్కువ. నెగ్గలేక తనకైతను వెనక్కు తిరిగి వస్తానని అతని నమ్మకం కాబోలు.

తనేమైనా తక్కువ తినిందా? అంతకు అంత!

విధీశను లోకంలోకి పడేస్తూ ఫోన్ మోగింది.

కృష్ణమూర్తిగారు. పెన్నా బిల్డర్స్, యం.డి.

"ఏమ్మా... ఆడిటరమ్మా... మీరేదో పన్ను తప్పించే ఉపాయాలు చెప్తారనుకుంటే ఇంత పన్ను కట్టాలని పంపారు..." ఆయన నిష్టూరపడ్డాడు.

అయితే తన అసిస్టెంట్ యామిని అక్కడికి చేరిందన్నమాట!

"మా యామిని మీ దగ్గరకు వచ్చింది కదా... మీ పుస్తకాలన్నీ ఆమెచేత పంపించండి. మరోమారు చూస్తాను."

అలాగే అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఆయన కంఠంలో దాగి ఉన్న అసంతృప్తిని విధీశ గ్రహించగలిగింది. ఎందుకు తను వీళ్లలో నమ్మకం కలిగించలేక పోతోంది?

మొదటినుంచీ అంతే. నాన్న అమ్మను ఎప్పుడూ అనేవాడు. 'జమాఖర్చుల వ్యవహారం ఆడవాళ్లు మీకేం తెలుస్తుంది' అంటూ.

నాన్నేమో సిటీలో పేరుమోసిన ఆడిటర్. అమ్మకు అకౌంట్స్ అర్థం అయ్యే అవకాశమే లేదని ఆయన ప్రగాఢ విశ్వాసం.

చివరికి తనకి మంచిమార్కులు వస్తుంటే డాక్టర్ కమ్మని ప్రోత్సహించాడు కానీ ఆడిటర్‌ని అవుతానంటే అయిష్టత చూపాడు.

"విధీ... నువ్వు చిన్నపిల్లవు. ఈలోకం సంగతి తెలియదు. ముఖ్యంగా నీలాంటి సున్నిత మనస్తత్వం ఉన్న అమ్మాయి ఆడిటర్‌గా ప్రాక్టీస్ చేయాలన్నా... నలుగురిలో నిలదొక్కుకోవాలన్నా ఎంతో కష్టంరా. లెక్కలంటే నీకంతగా ఇష్టమైతే ఇంజనీరింగ్ చెయ్యి..."

అసలు విషయం ఏమిటంటే... నాన్న కన్నా అమ్మే మా ఇంటి బడ్జెట్‌ను చక్కగా ప్లాన్ చేసేది. ఎంత ఖర్చుపెట్టాలో ఎంత పొదుపు చేయాలో ఆమెకే బాగా తెలుసు. జమాఖర్చులన్నీ చక్కగా ఓ నోట్‌బుక్‌లో రాసి పెడుతుంది ఈనాటికీ.

మల్లెపూల దగ్గర నుంచి మైక్రోవేవ్ దాకా... పాల పాకెట్లు నుంచి పార్టీల ఖర్చుల దాకా... అన్నీ రసీదులతో సహా పద్దు రాయడం ఆమెకు అలవాటు. నాన్న డైరీ రాసినట్లుగా!

"నాన్నేమన్నా లెక్కలు అడుగుతారా ఏమిటి?" అని అంటే, "మీ నాన్న అడుగుతారని కాదమ్మా... దేనికి ఎంత ఖర్చు పెడుతున్నామో... అది అవసరమో అనవ సరమో... నాకు తెలియడానికి."

చివరకు తనకు తమ్ముడికి పాకెట్‌మనీ ఇస్తూ కూడా చెరో పాకెట్‌బుక్ చేతిలో పెట్టేది. మొదట ఇచ్చిన దానికి లెక్క తేలితేనే మళ్లీ ఇచ్చేది!

ఆమె ఓ సమర్థవంతమైన ఆడిటర్ అనీ... ఓ ఫైనాన్షియల్ మేనేజర్ అనీ... అమ్మకే తెలియదు.

ఇక అత్తమ్మ సంగతి సరేసరి. ఆమె బ్యాంక్‌లో అకౌంట్స్ ఆఫీసర్.

తను ఆడిటర్‌గా ప్రవేట్ ప్రాక్టీస్ చేస్తానన్నపుడు మొదటి ప్రోత్సాహం అత్తమ్మదే. మామగారేమో ఓ మంచి అనుభవాన్ని విప్పి చెప్పేసారు.

"అమ్మా... నేనప్పుడు లీడ్ బ్యాంక్ మేనేజర్‌ని. మా గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మీద బోలెడన్ని పిటీషన్లు వచ్చిపడ్డాయి. ఆ అమ్మాయి నాకు ముందు నుంచీ బాగా తెలుసు. చురుకైనది, పని అంటే ప్రాణం. అలాంటి పిటీషన్ల నిండా ఆమె దారితప్పిన చెడు ప్రవర్తన గురించిన రాతలే. ఎంక్వైరీకి వెళ్లాం. ఆరా తీస్తే ఆమె చేసిన చెడ్డ పనేమిటో తెలుసా? సైకిలెక్కి చుడీ దార్ వేసుకొని రికవరీకి పల్లెల్లో తిరగడం! మారుమూల పల్లెల్లో అప్పులు ఇవ్వకా తప్పదు. అవీ ఎలాంటివి? గేదెను కొనుక్కోవడానికో... పంటకో... పొలానికో... అప్పులు రికవరీ చేయకపోతే పై నుంచి మొట్టికాయలు. చేయనుపోతే ఇదీ అవమానం. ఆ పల్లెల్లో రవాణా సౌకర్యం లేదు. ఆమె అనువుకి ఓ సైకిల్ కొనుక్కుంది. చీర వేసుకొని తొక్కలేదు కనుక చుడిదార్ వేసుకుంది. 'ఏవిటి సార్ నా చెడు ప్రవర్తన,' అని మమ్మల్ని అడిగితే మాట్లాడలేకపోయాం. ఎందుకంటే ఆ బ్రాంచిలో జిల్లా మొత్తంలో రికవరీ బావుంది. ఆమె మనసు విరిగి ట్రాన్స్ ఫర్ కావాలని సిటీకి వచ్చేసింది!" మామగారు ఆయాసం తీర్చుకొని మళ్లీ అన్నారు, "ఇదమ్మా ఆడ వారికి మనమిచ్చే గౌరవం! మనమిచ్చే స్వతంత్రం!"

ఇక నాన్న మొదలెట్టాడు.

"నగరంలో అదోతీరు. ప్రద్యుమ్న, నువ్వు ఉండ బోయేది పల్లె పట్నమూ కాని ఊరు. నా మాట విని ఎవరైనా సీనియర్ ఆడిటర్ దగ్గర అసిస్టెంట్‌గా చేరు."

"చదువుతూ ఉన్నంతకాలం సాయంకాలాలు నీకు అసిస్ట్ చేస్తూనే ఉన్నా కదా నాన్నా... ఇంకా కొత్తగా నేర్చుకోవాల్సింది ఏముంది? నేను స్వంతంగా స్వతం త్రంగా ప్రాక్టీస్ చేస్తా నాన్నా..." తన గొంతులో విశ్వాసం గుసగుసలాడడం తనకే తెలుస్తోంది.

"అంతెందుకురా... విధీ! మన సిటీ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ప్రైవేట్ ప్రాక్టీస్‌చేసే లేడీ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఎందరున్నారు? ఇద్దరో ముగ్గురో. వారూ తమ అసి స్టెంట్స్ ద్వారా అసెస్‌మెంట్స్ ఫైల్ చేయిస్తారే కానీ స్వయాన ఆఫీసులలోకి రాగా నేను చూడలేదు..."

"సీనియర్ ఆడిటర్ అయిన మీరూ వెళ్లరుగా నాన్నా..."

"కానీ నేను వెళ్లాలనుకుంటే వెళ్లాల్సి వస్తే ఏ అడ్డంకి లేదు. విధీ... ఆడవాళ్ల చుట్టూ కనిపించని గాజు గోడలు ఉన్నాయమ్మా... పైకి ఎదగనీయకుండా గాజు కప్పు పొరలు పొరలుగా కదలనీయవు. కదలలేవు. నీవే గ్రహిస్తావు. నీకు తెలియకుండానే నీ చుట్టూ అలుము కొని ఉన్న ఆ వాతావరణం నిన్ను ఎలా ఉక్కిరిబిక్కిరి చేయగలదో..."

"ఆ గాజుపొరల్ని, ఆ గాజుకప్పునీ బద్దలు చేయ గల విశ్వాసం నాకుంది నాన్నా..."

"మంచిదే తల్లీ... కానీ ఆ ప్రయత్నంలో నీకు గాయం కానీయకు..."

ఠాక్! నాన్న మాటల్ని కొట్టిపారేసింది తను.

ఇప్పుడిప్పుడు తెలిసివస్తోంది.

తన రెక్కలను తుంచివేయను ఎలా కనిపించని కత్తెరలను చాచి ఉంచుతుందో ఈ లోకం.

అంతదాకా ఎందుకూ? తన అసిస్టెంట్స్... అకౌం టెంట్స్... యామిని, సుమ, రమణ... ఎంత బేధం ఈ ముగ్గురిలో.

అందులోనూ యామినికి సుమకూ ఎంత తేడా...

వాళ్లల్లో తమ చదువు పట్ల, తమ శక్తియుక్తుల పట్ల నమ్మకం లేదెందుకని?

వాళ్లిద్దరూ వేరు వేరు కాలేజీల్లోంచి వచ్చినా ఇద్దరూ తొంభైశాతం పైన మార్కుల్తో డిగ్రీ పుచ్చు కున్నారు కదా?

ఎందుకంత భయం భయంగా ఉంటారు? ఎందుచేత ఆ పిరికితనం? వారి చదువు వారి ఉద్యోగం ఎందుకని ధైర్యాన్ని ఇవ్వడంలేదు?

అదే రమణ? నిలువెత్తు విశ్వాసం.

చకచక మాట్లాడతాడు. చాకచక్యంగా పని చక్క బెడతాడు. వీళ్లిద్దరి కన్నా వయసులో చిన్నవాడు, చదువులో తగ్గవాడు.

మాటల్లో పెట్టి వీళ్లతోనే పని పూర్తిచేయించి తన మెప్పు పొందాలని చూస్తుంటాడు. క్లయింట్స్‌తోనూ కలివిడిగా హుషారుగా ఉంటాడు. వీళ్లిద్దరూ ఒదిగొదిగి ఉంటారు!

ముఖ్యంగా సుమ... డిగ్రీ పరీక్షలు రాసి తిన్నగా తన దగ్గరికి వచ్చింది, మూడేళ్ల క్రితం.

"ఏమేం తెలుసు?" నన్నాను

"చిట్టాపద్దులు వేస్తానండి. లాభనష్టాల ఖాతా, వర్తకపు ఖాతా, చిల్లరనగదు పట్టీ, అంకణా, ఆస్తిఅప్పుల పట్టీ, ఆవర్జ ఖాతా... అన్నీ తెలుసండీ..." భయం భయంగా గుక్క తిప్పుకోకుండా అంది సుమ.

పక్కనే ఉన్న యామిని ఫక్కున నవ్వింది.

సుమ బిత్తరపోయింది.

వాళ్లిద్దరి ముఖాల్లో ఆ క్షణాల్లో కదిలిన భావాలు ఇంకా కళ్ల ముందు కదులుతున్నాయి.

యామిని అప్పటికే రెండేళ్ల నుంచీ తన దగ్గర పనిచేస్తోంది. పై నుంచి ఇంగ్లీష్ మీడియం. యామినిని సైగచేసి గది బయటికి పంపించాను.

అప్పటికే సుమ కళ్లల్లో నీళ్లసుళ్లు.

'ఈమాత్రానికే ఏడుపా? మంచినీళ్లు కావాలా?" తను అనునయంగా అంది.

సుమ తల అడ్డంగా ఊపింది. లంగా వోణీ... రెండు జడలు... పంజరం లోలాకులు.

"సరే... నిన్నిక్కడికి ఎవరు పంపారు?"

"ఎవరూ పంపలేదండీ... నేనే వచ్చాను. కాలేజికి వెళ్తూ రోజూ మీ బోర్డు చూసేదాన్ని. కాలేజీలో మా కామర్స్ అయ్యవారు కూడా మీ గురించి చెప్పేవారు... రోజూ..." గబగబ అంది.

'కాలేజీల్లో ప్రస్తావించేంత ఘనత వహించిందన్న మాట మన ఘనకార్యం!'

మళ్లీ అడిగింది, "ముందిది చెప్పు... అకౌంటెంట్‌కు ఉండవలసిన ముఖ్యలక్షణం ఏమిటి?"

"ఎక్కడి లెక్క అక్కడే మరిచిపోవాలండి." ఒక్క క్షణం ఆగి మళ్లీ తనే అంది, "ఈ మాట కూడా మా అయ్యవారే చెప్పారండి. ఎవరు ఇంటర్వ్యూకి వచ్చినా మీరు ఈ ప్రశ్న తప్పక అడుగుతారంట కదా..."

ఫక్కున నవ్వేసింది తను కూడా.

ఆ నిర్మలత్వమే సుమను అకౌంటెంట్‌ను చేసింది. రెండేళ్లలో యామినిని మించిపోయింది.

ఇంతకీ ఆమె ఏమి చేస్తుందో- సాయి మెడికల్స్ వాళ్ల సేల్స్‌టాక్స్ రిటర్న్ తయారుచేయాలని పురమాయించాను కదా... ఏమైందో...

తన గదికీ వాళ్ల గదికీ నడుమ కార్డ్‌బోర్డ్ పార్టీషన్. మధ్యలో గ్లాస్ పీస్. దాన్ని కప్పుతూ కర్టెన్.

విధీశ పరదాలు పక్కకు తీసింది.

సుమ తలవంచుకొని రాసుకొంటోంది.

తమ ఇద్దరికీ నడుమ ఉన్న గాజుపలక మీద మునివేళ్లతో తట్టింది విధీశ.

సుమ తలెత్తి చూసింది.

విధీశ రమ్మన్నట్లు సైగ చేసింది.

సుమ వచ్చింది.

"ఈ బ్యాలెన్స్‌షీట్‌లో లెక్క తప్పుతోంది. ఏదైనా ఎంట్రీ మిస్ అయివుండొచ్చు. నీవు బుక్స్ తీసుకురా. వోచర్స్ తీసుకురా. మరోసారి పూర్తిగా చెక్ చేద్దాం. నేనీలోగా టోటల్స్ మళ్లీ ట్యాలీ చేస్తాను..."

సుమ మౌనంగా వెళ్లింది. ఔననలేదు, కాదనలేదు. ముఖాన ఏ భావమూ లేదు.

స్ట్రేంజ్!

సుమ తిరిగి వచ్చింది.

నాలుగైదు బాక్స్ ఫైల్స్‌ను తెచ్చి టేబుల్ మీద పెట్టింది.

మళ్లీ వెళ్లింది. మళ్లీ వచ్చింది. మరికొన్ని ఫైల్స్ తెచ్చింది.

"చాలా ఉన్నాయే..." విధీశ కనుబొమలు విరిచింది. 'ఇది అసిస్టెంట్స్ చేయాల్సిన పని. తను కూడికలు చూడడం ఏమిటీ? ఛ...ఛ... తప్పదు. అన్ని పనులు చూసుకోక తప్పదు. అదే కదా ప్రైవేట్ ప్రాక్టీస్! ఎక్కడా లెక్క తప్పకూడదు. ఎవరు లెక్క చూశారన్నది కాదు ముఖ్యం.'

"సాయి మెడికల్స్ వాళ్ల ఎ1 రిటర్న్ రెడీ చేశారామ్మా," విధీశ సుమను అడిగింది.

సుమ ఏమీ మాట్లాడలేదు.

శూన్యదృక్కులను ముఖానికి అతికించుకుంది.

"సుమా... నిన్నే అడిగేది ఎ1 రిటర్న్ రెడీ అయ్యాయా?"

సుమ ముఖంలో ఏ మార్పు లేదు.

విగ్రహంలాగా నిశ్చలంగా నిల్చుని ఉంది.

విధీశకు అసహనం పెరిగిపోయింది.

"సుమా... ఆ ఫైల్ తీసుకురా- నేనే చేసి చూపిస్తాను..." విధీశ పెదవులు బిగబెట్టింది.

సుమ ఫైల్ తెచ్చి విధీశ ముందు పెట్టింది.

విధీశ ఫైల్ తీసి తిరగవేసింది.

అసలు ఈ ఏడాది పొడవునా ప్రతినెలా క్రమం తప్పక వేసిన సేల్స్‌టాక్స్ రిటర్న్ కాపీలు ఫైల్‌లో లేనే

లేవు. ఆ పన్నెండు నెలలూ కూడితేనేగా ఏడాది లెక్క తేలేది!

"దీంట్లో మంత్లీ రిటర్న్ లేవు కదమ్మా..."

సుమ ముఖం చెక్కలా బిగుసుకుపోయింది.

"అవి లేకుండా ఇప్పుడెలా లెక్క వేస్తావ్...?"

సుమ నుంచి మాటామంతీ లేదు.

విధీశకు కోపం ముంచుకొస్తోంది.

"ఏవీ ఆ కాగితాలన్నీ...? మన దగ్గర ఓ కాపీ వుండాలి కదా..."

సుమ తల దించుకుంది.

"లేవా?"

సుమ తల అడ్డంగా ఆడించింది.

"ఎక్కడైనా వేరే ఫైల్స్‌లో పెట్టేసారా? కాగితాల్లో కలిసిపోయాయా? యామినికి తెలుసా?" గబగబ అడిగింది విధీశ.

సుమ తెలీదన్నట్లు తలూపింది. అన్నింటికీ ఒకే సమాధానంగా.

విధీశకు లోలోనుంచి మండుకొస్తోంది.

ఇది చాలా చిన్న విషయం. ప్రతి అసిస్టెంట్‌కూ తను నేర్పే మొదటి పాఠం. ఏ కాగితమైనా ఓ కాపీ ఆఫీస్ ఫైల్‌లో పడేయమని!

మరి ఏమయింది?

"సుమా... అసలు ఆఫీసు కాపీ తీసిపెట్టనే లేదా?" సుమ తల వాల్చేసింది.

"ఇప్పుడెలా? ఎలా రాద్దామని...?" విధీశ అసహనంగా నుదుటిని వేళ్లతో వత్తుకుంది. 'అసలే తనకున్న క్లయింట్స్ తక్కువ. ఉన్న కొద్ది పార్టీల వ్యవహారాలు ఇలా చతికిలబడితే - ఇక తను నిలదొక్కుకున్నట్లే! తన మెతకదనమే వీళ్లందరికీ మరీ అలుసుగా ఉన్నట్లుంది,' విధీశ తల విదిలించుకుంది.

"సరే సుమా... మళ్లీ నెలవారీగా స్టేట్‌మెంట్స్ తయారుచెయ్యి," ఖచ్చితంగా చెప్పేసింది. అయినా కష్టమే. ఇంతకుమునుపే సేల్స్‌టాక్స్ ఆఫీస్‌లో సబ్మిట్ చేసిన వాటికి ఇప్పుడు సుమ తయారుచేసేవాటికి ఏ మాత్రం తేడా రాకూడదు. ఏ ఒక్క బిల్లు ఎంట్రీ మిస్సయినా! అందులోనూ మందులషాపంటే కొనుగోళ్లు అమ్మకాలు- ఏడాదిపాటు యం.ఆర్.పిలు, సేల్ ప్రైస్‌లు, పర్చేజ్ బిల్లులు... ఎలా రాద్దామనీ...?!? విధీశ తల విదిల్చింది.

సుమ తల వాల్చుకొనే ఆ ఫైల్ తీసుకొని గదిలోంచి బయటికి వెళ్లిపోయింది.

'ఏమిటిదీ? ఓ చిన్నపని ఆఫీస్ కాపీ తీసిపెట్టడం అన్నది....' విధీశ అసంతృప్తిగా అటూ ఇటూ కదిలింది.

పెన్నా బిల్డర్స్ వారి దగ్గరకు వెళ్లిన యామిని ఇంకా రాలేదు.

ఐటీ ఆఫీస్ దగ్గరకు వెళ్లిన రమణ ఇంకా రాలేదు.

ఇద్దరిలో ఎవరొచ్చినా సేల్స్‌టాక్స్ ఆఫీస్‌కు పంపించి ఆ ఎ2 రిటర్న్ కాపీ తెప్పించాలి.

ఇలా ఏ చిన్న అవసరాన్ని ఆశించి ఆ ఆఫీస్‌లలో అడుగుపెట్టే అవసరం రానేకూడదు. అందుకు తనెంత శ్రద్ధ తీసుకున్నా ఎక్కడో ఏ చిన్న పొరపాటో జరగకుండా ఎలా ఉంటుంది? మనపాటికి మనం పనులు చేస్తాం. ఇన్ని డిపార్ట్‌మెంట్స్‌లో ఎక్కడో ఓచోట ఓ జి.వోనో ఓ అమెండ్‌మెంటో వస్తుంది. వాళ్లు తెలియజేస్తే సంతోషం. లేదూ సరిజేస్తే మరీ సంతోషం.

కానీ, ఆ పొరపాటును దిద్దుతూ చేసే హేళన, చూసే చులకన చూపు, విసిరే విసుగూ అసహనం, మాటల్లో విరుపూ... ఛఛ... తనకే వళ్లంతా కారం రాసినట్లుంటుందే... ఇక ఈ అమ్మాయిలకు...?

"ఒద్దికగా ఉన్నంతసేపూ... వినయంగా మాట్లాడుతున్నంతసేపూ బాగానే ఉంటారు మేడం. ఏదైనా కాస్త గట్టిగా చెప్పబోయామా... అంతే సంగతులు!" యామిని ఓరోజు అంది, "మీతో మర్యాదగా ఉంటారు మేడం... మాతో వారి ధోరణి వేరుగా వుంటుంది..." ఆ అమ్మాయి అర్థాంతరంగా ఆగింది. అర్థయుక్తంగా ఆపింది.

అయితే నేనిప్పుడు ఏం చెయ్యాలి?

ప్రతిసారీ తను వెంటపెట్టుకొని వాళ్లను తీసుకెళ్లడానికి కుదరదు కదా? వాళ్లను ఒంటరిగా ధైర్యంగా పంపగలిగే వాతావరణం ఎలా సృష్టించాలి? తను వీళ్లకు ఎలాంటి బలాన్నివ్వాలి? ఏమి నేర్పి పంపాలి?

అందులోనూ సుమలాంటి అమ్మాయంటే... బెరుకు బెరుగ్గా... అసలే ఆమె పలుకు బంగారం... చిన్న మాటకే ఉలికి ఉలికి పడుతుంది. ఇక ధైర్యంగా చకచక ఎక్కడికంటే అక్కడికి వెళ్లేదెలా?

నాన్న ఈ మాట ఎన్నడో చెప్పాడు.

"విధీ... నువ్వు ఎవరన్నా సీనియర్ ఆడిటర్ దగ్గర అసిస్టెంట్‌గా అన్నా చేరు... లేదా నీ అసిస్టెంట్స్‌గా మగవాళ్లనాన్న పెట్టుకో. ఆడపిల్లలు ఆ ఆఫీసుల చుట్టూ తిరగలేరు-"

అదే ఎందుకు?

ఏ ఆఫీస్‌లో, ఏ బ్యాంక్‌లో చూసినా అకౌంట్స్ డిపార్ట్‌మెంట్స్ అన్నీ ఆడవాళ్లమయమే. ఆడిటర్ల దగ్గర అసిస్టెంట్లుగా ఎందరు ఆడవాళ్లు లేరు?

"కానీ అవన్నీ నైన్ టు ఫైవ్ డెస్క్ జాబ్‌లేగా! మార్చి, ఏప్రిల్‌లలో రేయింబవళ్లు పనుంటుంది కదా... ఒక క్లయింట్ ఆన్యువల్ ఆడిటింగ్‌కు ఒక్క ఓవర్‌నైట్ స్టేకి నీ అసిస్టెంట్‌ని పంపించగలవా? వాళ్ల అమ్మా నాన్నలు పంపిస్తారా? ఆ అమ్మాయి వస్తుందా?" నాన్న ఘాటుగా అడిగాడు.

వస్తుంది. కానీ... వచ్చే వాతావరణం ఏదీ?

సమాజం... కుటుంబం... వ్యక్తి...!?!

నాన్న మౌలికమైన ప్రశ్న వేసాడు. తన సమయ పాలన తన చేతుల్లోనే ఉందా? వృత్తి ప్రయాణాలు చేయగలిగిన స్వేచ్ఛ ఉందా?

తన ప్రతిభకూ, తన స్త్రీత్వానికి సంబంధం ఏమిటి? తను బ్యాలన్స్‌షీట్ తయారుచేసి ఎవరి ఎదురుగా అన్నా పెడితే అది స్త్రీ తయారుచేసిందో, పురుషుడు తయారుచేసిందో ఎవరైనా చెప్పగలరా?

"లేదురా విధీ... కానీ ఒక స్త్రీలాగా నువ్వు పదింతలు శ్రమ చేస్తున్నావ్... ఎక్కువ ఘర్షణ... ఎక్కువ వత్తిడి... ఎక్కువ ఆందోళన...! విధీ... అదేరా నా బాధ అంతా!" నాన్న గొంతు గాద్గదికమవడం తను మర్చిపోగలదా?

"మేడం..."

విధీశ ఉలిక్కిపడింది.

రమణ వచ్చాడు. మళ్లీ సేల్స్‌టాక్స్ ఆఫీస్‌కి పంపింది. రమణ వెళ్లాడు.

ఒక సుమ... ఒక యామిని... ఒక విధీశ... ఇంత సహజంగా ఏ సంకోచం లేకుండా... చకచక వెళ్లేరోజు ఎన్నటికి వస్తుందో...?

ఇదంతా... ప్చ్...! తనకు తెలుస్తూనే ఉంది.

తన క్లయింట్స్ ఒక్కొక్కరే నెమ్మదిగా తప్పుకుంటున్నారు.

వాళ్లకు తనెలా నమ్మకం కుదర్చాలి? ఎలా వాళ్లకు తన సామర్థ్యం మీద విశ్వాసం కలిగించాలి?

తనకు వచ్చిన ప్రశంసాపత్రాలు... గోల్డ్‌మెడల్స్... ఎందుకూ పనికిరావుగా? తనెంత చక్కగా ఆడిట్ చేయగలదో... తనెంత బాగా ఫైనాన్షియల్ రిపోర్ట్ తయారుచేయగలదో... ఎంత చురుకుగా కేస్‌ని డీల్ చేయగలదో... ఇవన్నీ ఎవరికీ అవసరంలేదు.

ఆ పెన్నా బిల్డర్స్ యం.డి. కృష్ణమూర్తిగారు అన్నట్లుగా ఎంత పన్ను తగ్గించగలను? నంబర్‌టు ఖాతాలు ఎలా మెయింటెయిన్ చేయించగలను? బ్లాక్‌ను ఎలా మ్యానేజ్ చేసుకోవాలో చెప్పగలను? ఇవీ... ఇవే కావాలి.

ఒక ఆడిటర్‌ని అంటే ఇలాంటి దళారినా? తనొక ఆర్థిక సలహాదారు. తనొక ఆర్థిక ప్రమాణం. ప్రభుత్వానికి ప్రజలకు నడుమ ఆర్థిక మధ్యవర్తి. తన క్లయింట్స్ చేత పన్నులు సక్రమంగా కట్టించేట్లు చూడడం తన బాధ్యత కాదూ? విద్యార్థులుగా మేం నేర్చిన పాఠాలన్నీ పన్నులు కట్టించడానికా? ఎగ్గొట్టించడానికా?

"నువ్విలా అంటావు కాబట్టే...! ఇక నీ ప్రాక్టీసు ఎలా పెరుగుతుంది?" ప్రద్యుమ్న దాపరికం లేకుండా అనేశాడు.

"ప్రద్యూ... గౌరవంగా హుందాగా సంపాదనను కూడబెట్టుకోవడానికి బోలెడు చట్టబద్ధమైన మార్గాలున్నాయి. అయినా పన్నులు కట్టకపోతే ఎలా చెప్పు? నీవు నడిచే రోడ్డెలా వస్తుంది? నీ వీధి దీపం ఎలా వెలుగుతుంది? నీ కొళాయిలోకి నీళ్లెలా వస్తాయి? బస్సులు, రైళ్లు ఎలా వస్తాయి? ఆసుపత్రులు, స్కూళ్లు ఎలా నడుస్తాయి?" కయ్‌మంది తనారోజు.

ప్రద్యుమ్న చెప్పింది నిజం! అది జనవాణి. లోకం పోకడ. ఆడిటర్ అంటే ప్రస్తుతం సామాన్యుడిచ్చే అర్థం అదే! శ్రీమంతుడిచ్చే పరమార్థం అదే!

వ్యక్తి విలువలు లేని వృత్తిధర్మం. వృత్తి ఆశయాలు లేని సమాజ ధోరణి.

సమన్వయం కుదరటం లేదు. సమతూకం సాధ్యం కావడం లేదు. తనకు చేతకావడంలేదు. తనవారిలో తను వెనుకబడిపోతోంది. ఎందుకలా?

తనలో ఆలోచన లేదా? తనలో ప్రతిభ లేదా?

విధీశ తల పట్టుకుంది. శూలాలతో పొడిచినట్టు తలనొప్పి! లోలోనుంచి!!

నేనంటే... నా ఆలోచనా?

కాదు!

నేనంటే... నా ప్రతిభా?

కానేకాదు!!

నేనంటే...???

నా లౌక్యం...!!!

ఇదీ ఈరోజటి సత్యం.

నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు!

ఈ ఆలోచనల నుంచీ తప్పించుకోవాలి.

ఈ తలనొప్పి నుంచీ తప్పించుకోవాలి.

"నీ ఆరోగ్యం మీద ఇదంతా ప్రభావం చూపుతోంది. తిండి తినవు. నిద్రపోవు. ఎందుకంత వత్తిడి? ప్రద్యుమ్న కూడా బాధపడుతున్నాడు తెలుసా? చేసే పని సావధానంగా చేసుకోవడానికి ప్రయత్నించు," నవ్య కూడా అంది.

"మరే... నలుగురితోపాటు నారాయణ అనుకుంటే ఏ తిప్పలూ లేవు. ఇదుగో ఇలా ఉలిపికట్టెలా ఊరి మీద పడితే కోరి మెడకు ఉరి బిగించుకున్నట్లే..." అమ్మ కాస్త కోపంగానే అంది. "వళ్లు గుల్ల చేసుకొని ఎందుకొచ్చిన సంపాదన? పిల్లలకెంత ఇబ్బంది?"

"సంపాదనా? తన క్లయింట్స్ తనకు తగ్గవారే. అకౌంటెంట్లను కూడా పెట్టుకోరు. తన అసిస్టెంట్లే వెళ్లి వాళ్లందరి జమాఖర్చులు రాసి రావాలి. వోచర్లు రాయించడం దగ్గర నుంచి బ్యాలెన్స్ షీట్ వేయడం వరకూ చేయించాలి. అన్ని టాక్స్‌ల ఫాంలు ఫిలప్ చేసి ఇస్తే సంతకాలు పెడతారు. ఇక ఆడిటర్ ఫీజు కలెక్ట్ చేయాలంటే అదో అష్టావధానం. ఫలాన ఆడిటర్ అయితే ఇంకా ఎంత పన్ను తగ్గేదో... ఫలాన ఆడిటర్ అయితే ఎంత చక్కగా ఐటివాళ్లను మానేజ్ చేస్తాడో... ఫలాన ఆడిటర్ ఎంత బాగా నెంబర్ 2 రాయిస్తాడో... ఇవన్నీ... మరిన్నీ... సోదాహరణంగా వ్రాక్కుచ్చి... తనను న్యూనతలో ముంచి... వచ్చే ఏడాదికి తన సేవలను కొనసాగిస్తామో లేదో అని ఓ అనుమానబాణం గ్రుచ్చి... ఎంతో కొంత చెల్లిస్తారు.

తమ దయ మా ప్రాప్తం... ఎందుకంటే 'పార్టీ' మరుసటి ఆర్థిక సంవత్సరానికి కొనసాగడం ముఖ్యం కాదూ?

ఛ... ఛ...!

ఇంత చదువు చదివీ... ఇన్ని విద్యలు నేర్చి...!

అబ్బబ్బా...!

ఫోన్.

ప్రద్యుమ్న.

"నవ్య మాట్లాడింది."

విధీశ మాట్లాడలేదు.

"ఇదంతా బ్యాటిల్ ఆఫ్ హార్మోన్స్ అనీ!"

విధీశ నవ్వింది సనసన్నగా ప్రద్యుమ్న కంఠంలోని నిజాయితీకి. నవ్య చెప్పిన బయాలజీ పాఠాన్ని ఎంత బుద్ధిగా విని ఉంటాడో ఊహించుకొని.

"నీలోని జీవరసాయనాల ప్రక్రియలు నిరంతరం నీలో కలిగించే ఆటుపోట్లను అల్లకల్లోలాలను నేను అర్థం చేసుకోలేకపోయాను." ప్రద్యుమ్న కంఠంలో ఆర్ద్రత, "విధీ... ఐయాం సారీ... తెలిసో తెలియకో ఏదైనా..."

"ఆగండి సార్...! నేనేమైనా క్షమాపణలు అడిగానా?" చటుక్కున అంది విధీశ.

"అదే మరి...!" కినుకపడ్డాడు ప్రద్యుమ్న.

"ప్రద్యూ... నువ్వే అన్నావ్‌గా... బ్యాటిల్ ఆఫ్ హార్మోన్స్ అనీ...!" విధీశ ఫక్కున నవ్వింది, "బ్యాటిల్ ఆఫ్ విట్స్... షుడ్ గో ఆన్... అండ్ ఆన్..."

"క్యారీ ఆన్..." ప్రద్యుమ్న నవ్వేసి ఫోన్ పెట్టేశాడు.

ఆ కంఠంలో ఆపేక్ష. విధీశ భర్తను ప్రేమగా తలుచుకుంది.

"టక్... టక్..." విధీశ తలెత్తి చూసింది. తనకూ తన అసిస్టెంట్స్‌కూ మధ్య ఉన్న గాజు పలక మీద మునివేళ్ల చప్పుడు. కర్టెన్ పక్కకు తీసి చూసింది.

యామిని. తను తిరిగి వచ్చేసానన్నట్లు సైగ చేసింది. రమణ కూడా అక్కడే ఉన్నాడు. ఇంతకీ సుమ ఏమైందీ? ముగ్గురూ కూడబలుక్కున్నట్లు తలలు దించుకుని చకచక రాస్తున్నారు. విధీశ కర్టెన్ వేసేసింది.

'ఇందాక కూడికలను సరిచూస్తూ ఓ చోట ఆగిపోయాను కదా... అరరే...' విధీశ తన పనివైపు దృష్టి పెట్టింది. దొరికింది! పొరపాటు ఎక్కడ జరిగిందో తెలిసింది!

ఒక పేజీలోని విలువలను మరో పేజీలోకి రాసేపుడు ఓ సున్నాను మింగేశారు! రెండు లక్షలు కాస్తా ఇరవైవేలయి కూర్చుంది. హతోస్మి!

ఎంత చిన్న పొరపాటు! ఇంతసేపు పట్టింది. లెక్క సరిచేయడానికి.

ఒకే ఒక సున్నా!

ఇన్ని లెక్కలు మార్చివేసింది. ఇన్ని తిప్పల్ని పెట్టింది. ఇంత ఇబ్బందిని పెట్టింది.

శూన్యాతిశూన్యమైన తేడా!

నవ్య కూడా ఇలాగే అంది, "జెనెటికల్లీ స్పీకింగ్... స్త్రీ పురుషుల నడుమ ఉన్న తేడా ఎంతో తెలుసా? ఒక్క క్రోమోజోమ్. నలభైయ్యారు సోమాటిక్ క్రోమోజోమ్స్ ఇద్దరిలో సరిసమానమే. మిగిలిన రెండు సెక్సువల్ క్రోమోజోమ్స్‌లో ఒకే ఒక్కటి తేడా. అంటే మొత్తం నలభై ఎనిమిదిలో ఒకటి తేడా. ఇంత చిన్నతేడా ఎన్ని తిప్పల్ని తెచ్చిపెట్టిందో చూసావా?"

ఒకే ఒక్క క్రోమోజోమ్!

సూక్ష్మాతిసూక్ష్మమైన తేడా !

తప్పిపోయిన ఆ సూక్ష్మ పరమాణువు చుట్టూ వెల్లివిరిసిన ఈ మానవసృష్టిలోని సమస్త బ్రహ్మాండం!

విధీశ నిట్టూర్చింది. ఆలోచనలను కట్టిపెట్టి... తప్పిన లెక్క పనిబట్టింది.

యామిని వచ్చింది. సాయి మెడికల్స్ వాళ్ల రిటర్న్ తయారయ్యాయి. టోటల్ సరిచూసి టాక్స్ ఎంతో చెప్పేసింది విధీశ. యామినితో అనింది, "ఆ మెడికల్స్ వాళ్లకీ చెప్పమ్మా..."

యామిని వెళ్లబోయింది.

"సుమని ఇక్కడికి రమ్మను."

యామిని వెళ్లిపోయింది.

అరగంట, గంట, గంటన్నర.

సుమ రాలేదు.

బ్యాలెన్స్ షీట్ తయారయింది. విధీశ ఫైల్ మూసేసింది.

సుమ ఇంకా రాలేదు.

'అదేమిటి? ఇవ్వాళ ఆ అమ్మాయి అలా ప్రవర్తిస్తోంది? పిలిచినా రాకుండా...! తన పని పూర్తయింది. రేపు చేయవలసిన పనులెన్నో ఉన్నాయి. ఇక ఈ ముగ్గురు ముత్యాల గురుగులు అంత దీక్షగా ఏమి రాస్తున్నారో...!'

విధీశ గాజుపలక మీద టకటక లాడించబోయి విరమించుకుంది. తనే వారి దగ్గరకు వెళ్లింది.

"చెబితే మేడంకి కోపం వస్తుంది. కానీ వాళ్లు ఏమంటున్నారంటే- మీరు ఎంతో చక్కగా రూల్స్ పాటిస్తారు. బుక్స్ రాస్తారు. ట్యాక్స్ కట్టిస్తారు. కానీ ఫార్మాలిటీస్ ఫాలో కారు. అదే మీతో చిక్కు..." రమణ హుషారుగా చెబుతున్నాడు. ఎవరో పలికిన పలుకులను చిలుకలా వల్లిస్తూ.

అమ్మాయిలు ఇద్దరూ తల ఎత్తకుండానే చెవులు అప్పగించారు.

"చాలా కేసులలో ఆడిటర్లకూ ఆఫీసర్లకూ మధ్య ఓ అవగాహన కుదిరేది ఎక్కడో తెలుసా - ఉదయం పూట వాకింగ్‌లోనో... సాయంత్రం టెన్నిస్‌క్లబ్‌లోనో... రాత్రి పార్టీలలోనో! మన మేడంని అలా... ఛ...ఛ..."

అప్పటికే అమ్మాయిలు విధీశను చూసేశారు. వాళ్ల ముఖాల్లో ఓ రకమైన తడబాటు. రమణ చూడ లేదు. విధీశ పెదవులపై వేలుంచి అమ్మాయిలిద్దరినీ మౌనంగా ఉండమని సైగ చేసింది.

"అసలు ఆడిటర్లకు తెలియకుండా ఏ పనీ జరగదు. రైడ్స్ దగ్గర నుంచి స్క్రూటినీ వరకూ. అంత అండర్‌స్టాండింగ్ వాళ్ల మధ్యన. మొన్న మన క్లయింట్ 'స్వర్ణా హోటల్స్' మీద జరిగిన రైడ్ ఎలాగ జరిగిందను కుంటున్నారు? మన మీద అపనమ్మకం కలిగించి వాళ్ల వైపు తిప్పుకోవడానికి... ఆ ప్రసాద్ కన్సల్టన్సీ వాళ్లు చేసిన పని! ఓ ఆఫీసర్ అంటాడు... మీ మేడంని ఫార్మాలిటీస్ అడగడమే కష్టమనీ...!"

"ఎందుకు అడగలేరట?"

విధీశ గొంతు విని ఎగిరిపడినంత పనిచేశాడు రమణ.

"అదీ..." రమణ నసిగాడు.

"మాకు ముందే చెప్పేశాడు," యామిని హుషారుగా చెప్పింది, "ఆడవాళ్లని ఎలా అడగాలని?"

"అంతేనా...?" విధీశ ఆరాగా అడిగింది.

"రమణా నువ్వు రావచ్చు కదా... ఆ అమ్మాయిలను ఎందుకు పంపుతారు? వాళ్లతో ఏం మాట్లాడాలన్నా ఇబ్బంది అని కూడా అంటారట," యామిని గడగడ వప్పజెప్పింది.

విధీశ ఇక ఏమీ మాట్లాడలేదు.

"వాళ్లు మాట్లాడదలచుకుంది ఏమిటి? వాళ్ల ఫార్మాలిటీస్ ఏమిటి? ఎవరికి తెలియదు? ఈ కాలంలో సర్వంసహా వర్ధిల్లే అతిసామాన్య విషయం. కట్టాల్సిన టాక్స్ కన్నా ముందు... ఆడిట్ ఫీజ్ కన్నా ముందు- అనఫీషియల్ ఆఫీస్ ఫీజు చెల్లించుకోవాలి! పువ్వుల్లో పెట్టి. ఆడవారిని అడగడానికి అభిమానం అడ్డొస్తే మరీ మంచిది! ఆ రకంగా.. ఎక్కువమంది ఆడవాళ్లు ఆడిటర్లుగా వచ్చి... ఎక్కువ సొమ్ము ఖజానాకు చేరొచ్చు గాక! తథాస్తు!!" విధీశ ముఖాన సన్నని నవ్వు కదలాడింది.

'అది అనుకున్నంత సులభమా? తమ బంగారు పుట్టలో వేలుపెడితే ఎవరూరుకుంటారు? రమణ అన్న దాంట్లో వాస్తవం లేకపోలేదు. అది ఆఫీసర్లకూ ఆడిటర్లకూ మధ్య రాసి ఉంచిన ఓ అదృశ్య మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్...!' విధీశ నిట్టూర్చింది. తెప్పరిల్లి రమణ వంక చూసింది.

విధీశ ఏమీ చెప్పబోతోందో అని బిక్కముఖం వేసుకొని చూస్తున్నాడు.

"సరే... రమణా ఇక నువ్వు ఇంటికి వెళ్లు. రేపు చాలా పనులు ఉన్నాయి. పొద్దున్నే రావాలి," విధీశ నవ్వు ముఖంతో చెప్పింది.

రమణ కుదుటపడ్డాడు. విధీశ తన గదిలోకి వెళ్లి కూర్చుంది. తను ప్రాక్టీస్ ప్రారంభించిన రోజున ఊళ్లోని

ఆడిటర్లందరూ వచ్చి... చక్కగా ఇచ్చిన ఉపన్యాసాలూ... కురిపించిన ప్రోత్సాహం... జ్ఞాపకం వచ్చాయి. నవ్వొచ్చింది. అప్పుడూ వీరే! ఇప్పుడూ వీరే!

రమణ వెళ్లిపోయాడు. యామిని విధీశ దగ్గరకు వచ్చింది. సుమ గురించి చెప్పింది. విన్న విధీశ మెదడు మొద్దుబారిపోయింది. తేరుకుని చకచక డా॥ నవ్యకు ఫోన్ చేసి అంబులెన్స్ పంపమంది. యామినిని వెంటనే ఓ కొత్త డ్రెస్ తెమ్మని డబ్బిచ్చి పంపింది. తన డెస్క్‌లో ఉన్న శానిటరీ న్యాప్‌కిన్స్ తీసుకొని సుమ దగ్గరికి పరిగెత్తింది.

'సుమా... షి ఈజ్ బ్లీడింగ్ లైక్ హెల్! విపరీతమైన రక్తస్రావం!' విధీశ ముఖాన నెత్తురుచుక్క లేనంతగా పాలిపోయింది. 'తనకూ వారికీ మధ్య ఓ గాజుపలక! అయ్యో... సుమ స్పృహ తప్పేట్లుగా ఉంది...'

ఇంతలో యామిని డ్రస్ పట్టుకొచ్చింది. సుమ యామిని సాయంతో డ్రస్ మార్చుకుంది. అంబులెన్స్ వచ్చింది. నవ్య నిమిషాల్లో అడ్మిట్ చేసి, ఇంజక్షన్లు ఇచ్చి, సెలైన్ పెట్టేసింది. యామిని సుమ వాళ్లింటికి ఫోన్ చేసి వచ్చింది.

నవ్య విధీశను తన రూంలోకి తీసుకెళ్లింది.

విధీశ తల పట్టుకు కూచుంది.

"విధీ... ఆ అమ్మాయి స్పృహ తప్పకుండా ఎలా మేనేజ్ చేసిందో తెలియడంలేదు. సివియర్ బ్లీడింగ్, ఇంకా తగ్గకపోతే రక్తం ఎక్కించాల్సి వస్తుంది. కంట్రోల్ అవుతుందనే..." నవ్య ఏకబిగిన అంది. "విధీ విద్యార్థినుల్లో పరీక్షల ముందు ఇది మామూలే. ఇప్పుడు ఉద్యోగినుల్లోనూ... డియుబి- డిస్‌ఫంక్షనల్ యుటిరైన్ బ్లీడింగ్... నా ట్రీట్‌మెంట్ మాత్రమే సరిపోదు. ఆమెకు సైకలాజికల్ సపోర్ట్ ఇవ్వాలి. నువ్వూ... నేనూ... అందరం...!"

"సారీ నవ్యా... సుమ పొద్దుణ్ణించి ఆఫీసులోనే ఉంది. ఇలాంటి సమస్య ఆమెకు ఉందని నాకు తెలియదు. ఎందుకో మూడీగా ఉందనుకున్నానుగానీ. సారీ... నేను ఊహించలేకపోయాను. సుమ కూడా మాట మాత్రం చెప్పలేదు..." విధీశ పశ్చాత్తాపం నిండిన గొంతుతో అంది.

"చెప్పరు. నాతోనే చెప్పరు. నేను వంద ప్రశ్నలడిగితే ఓ సమాధానం వస్తుంది. ఆ చెప్పలేకపోవడానికి సవాలక్ష సంకెళ్లున్నాయి. ఆడవాళ్లంతా నీలాగా నాలాగా మాట్లాడగలరనుకుంటున్నావా? వాళ్లు మాట్లాడలేని మాటలెన్నో ఉన్నాయి!" నవ్య ఉద్వేగంగా అంది.

"ఎప్పణ్ణించీ...?" విధీశ కంఠం పీలగా పలికింది. "సుమ... అలా... ఎప్పణ్ణించీ...?"

"సుమారు రెండుగంటల నుంచీ ఏకధారగా."

'అవును. అప్పుడే రమణ వచ్చాడు. అమ్మాయిల ఎదురుగా కూర్చున్నాడు.' విధీశకు ఇక విషయం తేటతెల్లమైపోయింది. 'సుమ కూర్చున్నచోటి నుంచి లేవలేదు. లేస్తే అతని కంటబడుతుంది. ఆ అబ్బాయి కదల్లేదు. అతనికి పాపం ఏ ఇబ్బందీ తెలియదు. పైనుంచి ఆ అమ్మాయికే సాయం చేస్తూ- ఆమె చేయవలసిన పనికి చేదోడుగా కూర్చున్నాడు.'

విధీశకు తనా గదిలోకి వెళ్లినపుడు సుమ ముఖం జ్ఞాపకం వచ్చింది.

'ముఖం పాలిపోయి... పళ్లు బిగువున... కదలకుండా... తలదించుకొని... అయ్యయ్యో...!' విధీశ ముఖంలో అపరాధభావం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గుండె డొల్ల అయిపోయింది.

"నాలోని హార్మోన్ల ఆటుపోట్ల గురించి ప్రద్యుమ్న అర్థం చేసుకోవట్లేదని అలక పూనానే! నా పక్కనే ఉన్న నా అసిస్టెంట్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండొచ్చో నేను ఏమాత్రం అర్థం చేసుకోకపోయాను" విధీశ బాధపడింది.

"రిలాక్స్... విధీ... మరోలా ఆలోచించు. నీ ప్లేస్‌లో ఓ పురుషుడు ఉంటే...? కొలీగ్స్ అంతా మగవారే అయితే...? ఆ అమ్మాయి ఆ ఎంబ్రాస్‌మెంట్‌కే...!" నవ్య అర్థాంతరంగా ఆగింది.

విధీశ తల గిర్రుమంది. యామిని ఆటపట్టిస్తేనే కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరిగే సుమ...! సిగ్గుతో చితికి... అవమానంతో కుళ్లి... బిడియంతో కుమిలి... వద్దొద్దు... ఇకపై ఆలోచించొద్దు.

"ఏకవస్త్రను నేను గడపదాటి రాలేనని వదినమ్మ ఎంతగా ప్రాధేయపడినా... వినక ఆమె జుట్టుపట్టి నిండు సభకు ఈడ్చుకువెళ్లి వివస్త్రను చేసిన పరంపర కాదూ మనది" నవ్య గొంతు గద్గదమైంది. "విధీ... నీ ఆఫీస్‌లో కనీసం బాత్‌రూం ఉంది. చెప్పుకోవడానికి సుమ పక్కన యామిని ఉంది. నీవు శానిటరీ న్యాప్‌కిన్స్ ఇచ్చావు. ఎన్ని చోట్ల ఎన్ని సందర్భాల్లో ఇలా వీలవుతుంది? ఆ అమ్మాయి సిగ్గుతో బిడియంతో అవమానంతో అలాగే ఇంకాసేపు ఉండి ఉంటే..."

విధీశ ఆ ఊహకే తెల్లబోయింది.

"అదే... మన పిల్లలకు నేర్పాల్సింది. మన ఆడవాళ్లకి నేర్పాల్సింది. మన మగవాళ్లకి నేర్పాల్సింది. ఇది

ఒక సహజ శరీరధర్మం. ఇందులో అవమానమూ లేదు. అసహ్యమూ లేదు. సిగ్గుపడాల్సిందీ లేదు. చితికిపోవాల్సిందీ లేదు. ఋతుచక్రం ఆడవారిని అనుక్షణం శాసిస్తూనే ఉంటుంది. రసాయన ప్రక్రియలు అదృశ్య రూపంలో ఆడిస్తూనే ఉంటాయి. నిత్యజీవితంలో నిరంతరం చెలరేగే ఈ సంఘర్షణ ఈ వత్తిడి ఈ ఆందోళన- ఆ జీవ రసాయన ప్రక్రియను ప్రభావితం చేస్తూనే ఉంటాయి. విధీ... వి నీడ్ బ్యాలెన్స్!” నవ్య దిగాలుగా అంది, “కాస్తంత సమతుల్యం కావాలి విధీ...!”

‘అవును. నవ్య చెప్పింది నిజమే.

బ్యాలన్స్ షీట్ ట్యాలీ కావడం లేదు.’

ఎందుకోగాని విధీశ కళ్ల ముందు మామగారు ప్రస్తావించిన ఆ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగిని కదలాడింది.

ఆమె... అమ్మ... అత్తమ్మ... సుమ... యామిని... నవ్య... తను... ఎవరైతేనేం?

అందరినీ ఆడించే దారం ఒక్కటే.

ఆ దారం చిక్కుపడిపోయింది. విప్పలేనంతగా.

విధీశతో అత్తమ్మ ఆ గ్రామీణ ఉద్యోగిని గురించి అన్నమాటలు జ్ఞప్తికి వచ్చాయి.

“ఆ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగినిని గురించి బరితెగించిందనీ, బజారున పడిందనీ గుసగుసలు పోయిన పట్టణ బ్యాంకు ఉద్యోగుల్లో మేమూ ఉన్నామమ్మా... కానీ అది ఆ అమ్మాయికి పనిపట్ల ఉన్న శ్రద్ధ అనీ, వ్యక్తిగా ఆమె నిజాయితీ అనీ... వృత్తిపట్ల ఆమె నిబద్ధత అనీ... మేం అనుకోలేకపోయాం. మాకు చేరిన పిటిషన్ల కళ్లతో మేం చూసాం.

“నేనా పని చేయగలనా? ఎందుకు చేయలేను? ఆ అమ్మాయి ఎలా చేయగలిగింది? వీటన్నింటికీ మావద్ద సమాధానాల్లేవు. ఒక నిజాయితీ గల ఉద్యోగినిని నిలువునా కుళ్లబొడిచిన సందర్భమది. మాకూ తెలియనితనం, నలుగురితోపాటు మేమూ ఓ రాయి వేసామే కానీ - ఆ వేస్తున్న రాయి ఆమెతో పాటు మేము నడిచే దారిలో మేట పడుతుందని ఊహించలేకపోయామమ్మా... మీ మామగారు ఎంక్వైరీ పూర్తిచేసి వచ్చి విషయం చెప్తున్నపుడు సిగ్గుతో చచ్చిపోయినంత పనైంది.

“ఆమెకంటూ ఓ వ్యక్తిత్వం ఉంది. జీవితం వుంది. ఓ కుటుంబం ఉంది. లోకం ఉంది. అన్నింటిపై ఈ సంఘటన ఎలాంటి ప్రభావాన్ని చూపి ఉంటుంది? ఎంతటి క్షోభ... హింస...!

“విధీ... నువ్వు ఓ లెక్చరర్‌కి ఉదాహరణ. ఓ స్టూడెంట్‌కి ఆదర్శం. నీ బాధ్యత పెరిగిందమ్మా... ఎన్ని వత్తిళ్లున్నా నీ మనసు విరగనీయకు. నీవు విచ్చిపోకు. నీవు చతికిలబడిపోకు. నీవు వేసే అడుగు ఎంత చిన్నదైనా...!”

అత్తమ్మ గొంతులోని ఆర్ద్రత గుర్తుకు వచ్చి విధీశ కళ్లు తడికట్టాయి.

గట్టిగా కళ్లు మూసుకుంది. ఉవ్వెత్తుతున్న ఆలోచనల్ని అదిమిపెడుతున్నా... ఎంతకీ తేలని లెక్కల్లా చిక్కుబడిపోతున్నాయి.

అవును.

బ్యాలెన్స్ షీట్ ట్యాలీ కావడంలేదు.

శరీరధర్మాలకు... కుటుంబ జీవనానికి...

వ్యక్తి స్వతంత్రానికి... సంఘ వైఖరికి...

వృత్తి గౌరవానికి... సమాజ ధోరణికి...

అస్తిత్వ సాధనకు... అనంత వేదనకు...

మానవ విలువలకు... సృష్టి వైచిత్రికి...

నడుమ -

బ్యాలెన్స్ షీట్ ట్యాలీ కావడంలేదు.

ఎక్కడో ఏదో ఎంట్రీ తప్పిపోయింది.

కూడికలోనో. తీసివేతలోనో.

అంకణాలోనో. ఆవర్జాలోనో.

*ఇండియా టుడే, 10 డిసెంబర్ 2002*

